# కోతకు గురైన రహదారులు

దెబ్బతిన్న వంతెనలు.. ● పట్టించుకునే పాపన పోలేదు..! ● జిల్లా ఇన్చార్జి మంత్రి ఆదేశాలు బేఖాతర్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు ఏజెన్సీ మండలాల్లోని రహదారులు కోతకు గురవగా, కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాంకిడి మండలంలోని రాజుల గూడ వెళ్ళే దారిలో ఓ వంతెన కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. రహదారి గుంతలుగా మారి దానిపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. ఈ గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో వాటి లోతు తెలియక ప్రమాదాలు సైతం సంభవించే అవకాశాలు ఉన్నాయ అని గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా జిల్లాల్లోని ఆసిఫాబాద్ మండలంలోని రాజుర గ్రామానికి వెళ్లే కల్వర్టు ప్రమాదకరంగా మారింది. వర్షాల నేపథ్యంలో ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. జిల్లాల్లో వర్షాలుతో ప్రమాదాలకు గురి అయిన రోడ్లు, కల్వర్టులు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఇన్చార్జి మంత్రి ఆదేశించినప్పటికీ ఆయన ఆదేశాలు సంబంధిత అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. వివిధ మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు పలు రహదారులు కోతకు గురయ్యాయి. మరమ్మతులు చేపడితేనే రాకపోకలు సాగుతాయని గ్రామస్థులు చెబుతున్నారు.

## శ్రమదానంతో ఆనకట్టకు మరమ్మత్తులు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలో నిజాం నవాబుల కాలంలో నిర్మించిన స్ప్రింగ్ ఆనకట్ట మత్తడికి గండిపడి నీరు వృధాగా పోతుందని స్థానిక రైతులు తెలిపారు. ఈ ఆనకట్ట కింద వందల ఎకరాల వ్యవసాయం సాగు చేస్తుండగా నీరు వృధాగా పోవడంతో వ్యవసాయానికి నీరు అందక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆనకట్టను మరమ్మత్తు చేయాలని స్థానిక అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీలేక స్ప్రింగ్ ఆనకట్ట కింద వ్యవసాయం సాగు చేస్తున్న రైతులందరూ మంగళవారం శ్రమదానం చేసి సిమెంటు, యూరియా, డీఏపీ ఖాళీ బస్తాల్లో ఇసుకను నింపి గండిని పూడ్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం మరమ్మత్తు చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. స్ప్రింగ్ ఆనకట్టతో పాటు కాల్వలను కూడా పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేయించాలని జిల్లా కలెక్టర్ ను కోరుతున్నట్లు తెలిపారు.



## డొంగర్ గావ్‌లో వైద్య శిబిరం

3కిలో మీటర్లు కాలిబాటన వెళ్లిన జిల్లా వైద్యాధికారి

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని సవతి గ్రామపంచాయతీ పరిధిలో గల డొంగర్ గావ్ గ్రామంలో మంగళవారం జిల్లా వైద్య అధికారి డాక్టర్ సీతారాం, ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మారుమూల గ్రామమైన డొంగర్‌గావ్‌కు 3 కిలో మీటర్లు కాలిబాటన నడుచుకుంటూ వెళ్లి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణీలు ప్రసవానికి వారం రోజుల ముందే ఆసుపత్రికి రావాలని సూచించారు. సరైన సమయంలో టీకాలు వేసుకోవాలని, అదేవిధంగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టం సర్వే పకడ్బందీగా జరపాలి



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డోంగ్లి మండలంలోని పెద్ద టాక్లి, చిన్న టాక్లీ, సిర్పూర్, లింబూర్, కుర్లా, యానుబూర, ఇలేగావ్, మాదన హిప్పర్గ్, కుర్ల గ్రామాల్లో సోయాబీన్, వరి, పంటలకు నష్టం వాటిల్లిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జు దేశాయ్ తెలిపారు. పంట నష్టం జరిగిన ఒక్క ఎకరం కూడా వదలకుండా సర్వేలో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పెద్ద టాక్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయలు గోండా, మండల కోఆర్డినేటర్ విలాస్ గైక్వాడ్, పెద్ద టాక్లి రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** మద్నూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల తహశీల్దార్ ఎండీ ముజీబ్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ శరత్, గిర్దవార్ శంకర్, రవి, బాలరాజు, ప్రవీణ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై పనిముట్లు



**ఉద్యమ కెరటం, తాండూర్:** రైతులకు రాయితీపై వ్య వసాయ యంత్ర పరికరాలు, పని ముట్లు అందజేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి సుష్మ తెలిపారు. మండలానికి బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రోటివేటర్లు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, ట్రాక్టర్ డ్రోన్ ఇంప్లిమెంట్స్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, బండి ఫార్మర్, పవర్ టిల్లర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు 50 శాతం రాయితీ, మిగితా రైతులకు 40 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు కావాల్సిన రైతులు ఈనెల 12వ తేదీలోగా సంబంధిత మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

## 11న జాబ్ మేళా

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 11వ తేదీన ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హెటెరో కంపెనీలో హైదరాబాద్ ప్రాంతంలో 40 జూనియర్ ఆఫీసర్ (స్త్రీలు/పురుషులు), 100 జూనియర్ కెమిస్ట్/ ట్రైనీ - ప్రొడక్షన్ (పురుషులు), 60 జూనియర్ ఇంజనీర్ / ట్రైనీ - ఇంజనీరింగ్/మెయింటెనెన్స్ (పురుషులు) పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండి సరైన విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9059888389, 7702284181, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్, విద్యారత సర్టిఫికెట్లు నిజప్రతులతో పాటు ఒక జత నకలు ప్రతులతో మినీ జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు.

## కాళోజి జీవితం ఆదర్శం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** కాళోజి నారాయణ రావు జీవితం తెలంగాణ ప్రజలకు ఆదర్శప్రాయమని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్ అన్నారు. కాళోజి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కాళశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు లెక్చరర్ నాగోరావ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక

**ఉద్యమ కెరటం, దహెగాం:** దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామానికి చెందిన పలువురు ప్రముఖ నాయకులు సోమవారం డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకుడు బబ్లూ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒడ్డుగూడ గ్రామ నాయకులు బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. అనంతరం బబ్లూ మాట్లాడుతూ ఒడ్డుగూడ గ్రామ నాయకుల చేరికతో బీఆర్ఎస్ పార్టీ స్థానికంగా మరింత బలపడుతుందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ షాకీర్, నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావ్, సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, గ్రామానికి చెందిన ఇతర ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌కు సన్మానం



**ఉద్యమ కెరటం, పెంచికల్‌పేట్:** తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిని మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎర్రకుంట చెరువు పరిశీలన



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీలో గల ఎర్రకుంట చెరువును మంగళవారం బెల్లంపల్లి తహశీల్దార్, ఆర్ఐ, ఇరిగేషన్ డీఈ, ఏఈ, ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు. ఎర్రకుంట చెరువుకు గండి కొట్టి, ఆక్రమణకు సంబంధించి, రైతు-కార్మిక సంఘాల ఐక్యవేదిక, గ్రామస్తుల ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశానుసారం 4వ దఫా సర్వే నిర్వహించారు. ఎఫ్టిఎల్, బఫర్ జోన్లు కలిపి 14 ఎకరాల భూమికి ఎర్రకుంట చెరువు విస్తరించి ఉందని తెలిపారు. ఎఫ్టిఎల్ లో గల రియల్ ఎస్టేట్ వారి పోల్స్ ను రేపు తొలగించి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇసుక బస్తాలతో తాత్కాలిక గండి పూడ్చివేత పనులు జరుగుతాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని తహశీల్దార్ సూచించారు. రెండు రోజుల్లో పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్‌కు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కు పంపిస్తామని అన్నారు. వారి వెంట రైతు, కార్మిక సంఘాల నాయకులు టి మణిరామ్ సింగ్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు ఎండి చాంద్ పాషా, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, ఓపిడిఆర్ జిల్లా కన్వీనర్ గోగర్ల శంకర్, ఎఐకెకెఎస్ రాష్ట్ర నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆదివాసి ఉపాధ్యాయుడి మృతి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండ లంలోని లంబాడిగూడ గ్రామాని కి చెందిన తొర్ర శంకర్ ప్రసాద్ అనారోగ్యంతో సోమవారం రా త్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ సో మిని క్లస్టర్‌లోని అంబగట్ట బూ రుగుడా గిరిజన ప్రాథమిక పాఠ శాలలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ గా విధులు నిర్వహిస్తు న్నాడని తెలిపారు. గత ఆరు నెలలుగా సీఆర్టీలకు వేతనాలు రాకపోవడంతో అనారోగ్యం బారినపడ్డ శంకర్ వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇంటి వద్దనే ఉండిపోయాడు. అనారోగ్యంతోనే ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి వస్తుండగా సోమవారం రాత్రి ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. గిరిజన గ్రామాల్లో ఆదివాసీల ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పడానికి ఉపాధ్యాయుడు మృతి నిదర్శనమని గిరిజన సంఘాల నాయకులు తెలిపారు. సీఆర్టీలుగా పనిచేస్తున్నఉపాధ్యాయులకు ప్రతినెల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలసరి వేతనాలు ఇవ్వకపోవడంతోనే శంకర్ మృతిచెందాడని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**ఉద్యమ కెరటం, దహెగాం:** దహేగాంలోని వాసవి మోడ్రన్ రైస్ మిల్లులో 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో మిల్లులో దాడులు చేపట్టగా, ఒక మహీంద్ర సుప్రో వాహనం పీడియస్ బియ్యం లోడ్‌తో మిల్లులో ఉందని, అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే మిల్ ఆవరణలో గల రేకుల షెడ్డులో సైతం కొన్ని పీడీఎస్ బియ్యం బస్తాలు లభించినట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు సుమారుగా 50 క్వింటాళ్లు పీడీఎస్ బియ్యం లభించిట్లు పేర్కొన్నారు. రైస్ మిల్ యజమాని, వాహన డ్రైవర్, కన్నెపెల్లికి చెందిన బియ్యం దందా చేస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

